మార్కెట్‌కూ మూఢం

- పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యక్రమాలకు బ్రేక్
- బంగారం, వస్త్ర, ఇతర వ్యాపారాలపై తీవ్ర ప్రభావం
- 40 శాతం తగ్గిన అమ్మకాలు

ప్రకాశం నగర్: వాణిజ్య కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులు తగ్గడంతో వెలవెలబోతున్నాయి. హిందూ సంప్రదాయం ప్రకారం మూఢమిగా పరిగణించే గురు, శుక్ర మూఢముల కారణంగా పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలకు ముహూర్తాలు లేవు. ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచి ప్రారంభమైన గురు, శుక్ర మూఢములు ఆగస్టు 8 వరకూ ఉండడంతో పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు వంటి శుభ కార్యక్రమాలు లేవు. ఈ నేపథ్యంలో ఆయా కార్యక్రమాలకు అవసరమైన దుస్తులు, బంగారం, ఇతర పూజా సామగ్రి, పువ్వుల దుకాణాలు, కిరాణా, ఫ్యాన్సీ వస్తువులు వంటి వాటి అమ్మకాలు తగ్గాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. నగరంలోని ప్రధాన మార్కెట్లైన మెయిన్ రోడ్డు, కోటగుమ్మం సెంటర్, గుండు వారి వీధి, టౌన్ హాలు రోడ్లతో పాటు, తాడితోట మహాత్మాగాంధీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్, చందన మార్కెట్ వంటి ప్రధాన మార్కెట్లు ఆశించిన స్థాయిలో వ్యాపారాలు లేక ఆయా షాపులు వెలవెలబోతున్నాయి.

ఉపాధిపై తీవ్ర ప్రభావం

శుభ కార్యాలు లేకపోవడంతో ఆయా రంగాలపై ఆధారపడి ఉన్న కేటరింగ్ చేసే వంట మనుషులు, సప్లయి కంపెనీ, లైటింగ్, డెకరేషన్ కార్మికులు, కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లలో పనిచేసే కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా చిరు వస్త్ర వ్యాపారులు, ఫుట్‌పాత్ వర్తకులు అమ్మకాల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా, కార్పొరేట్ వ్యాపార సంస్థల్లో సైతం ఆశించిన స్థాయిలో విక్రయాలు లేవు. ఈ నేపథ్యంలో వారి విక్రయాలను పెంచుకునేందుకు ఆయా సంస్థలు కొనుగోలుదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నారు.

ఆగస్టు వరకూ అంతంతమాత్రమే..

ఈ ఏడాది జూన్‌లో మూఢమి, జూలైలో ఆషాఢ మాసాలు ఉండడంతో ఆగస్టులో శ్రావణ మాసం వచ్చే వరకు ఈ సీజన్‌లో వ్యాపారాలు అంతంతమాత్రంగానే ఉంటాయని వర్తక ప్రతినిధులు చెబుతున్నారు. సామాన్యంగా సీజన్‌తో పోలిస్తే, 40 శాతం అమ్మకాలు తగ్గిపోవడంతో ఈ రెండు మాసాలు షాపు అద్దె, కరెంట్ బిల్లులు, కార్మికుల జీతాలు, రోజు వారీ ఖర్చులు వంటివి అదనపు భారంగా మారుతాయంటున్నారు. మరలా పెళ్లిళ్ల సీజన్ వస్తే వ్యాపారాలు పుంజుకుంటాయని వర్తక వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.



నిత్యం రద్దీగా ఉండే మెయిన్ రోడ్డు కొనుగోలుదారులు లేక వెలవెలబోతోందిలా..

ఆశించిన స్థాయిలో లేవు



సీజన్‌తో పోలిస్తే ఈ రెండు మాసాల్లో వ్యాపారాలు ఆశించిన స్థాయిలో ఉండవు. ముఖ్యంగా వస్త్ర వ్యాపార రంగంలోకి కార్పొరేట్ సంస్థలు రావడంతో, సామాన్యులు సైతం షాపింగ్ మాల్స్‌లో వస్త్రాలు కొనుగోలు చేస్తున్నారు. యువత ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌ల్లో వస్త్రాల కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో చిన్న, మధ్య తరహా వ్యాపారాలు మూతపడే పరిస్థితులు ఏర్పడ్డాయి.

– ఎం.సత్యనారాయణ (వస్త్ర వ్యాపారి)

మెరుగైన ఫలితాలు సాధించాలి

డీవైఈఓ నారాయణ

కడియం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖాధికారి నారాయణ అన్నారు. పాఠశాలల వార్షిక తనిఖీల్లో భాగంగా మండలంలోని మాధవరాయుడు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సబ్జెక్టు ప్యానల్ సభ్యులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. సీనియర్ హెచ్‌ఎం కేవీ రమణరావు, ఎస్‌ఎల్‌వీ రమేష్, జి.ప్రమీలరాణి, పి రాజు, నాగరాజు, గొల్లపల్లి సత్యనారాయణ, బి.సువర్ణవేణి, విజయకుమారి ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం స్కూల్‌లోని విద్యార్థుల రాత పుస్తకాలు, వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరుతో పాటు, ప్రతి తరగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించాలని, మొదటి నుంచి ప్రణాళికా బద్ధంగా చదవాలని విద్యార్థులకు సూచించారు. అలాగే 9, 8 తరగతి విద్యార్థులు ట్యాబ్‌లు ఏ విధంగా ఉపయోగిస్తున్నారు, రాత పుస్తకాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం వీవీఎస్ ప్రసాద్ అధ్యక్షతన స్టాఫ్ మీటింగ్ నిర్వహించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పరిశీలన బృందం

ఉపాధ్యాయుడికి ఘన సత్కారం

కడియం: చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 ఏళ్లుగా పని చేసి, ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేస్తున్న చిటిమోజు వీరవెంకట సత్యనారాయణమూర్తి దంపతులను శుక్రవారం స్కూలు ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. 1982లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన సత్యనారాయణ 35 ఏళ్లలో కేశవరం, పేరవరం, కడియం ఉన్నత పాఠశాలల్లో పనిచేశారు. పదవీ విరమణ సందర్భంగా సత్యనారాయణమూర్తి రచించిన ఆత్మాశ్రయ శివ శతకాన్ని పాఠశాల హెచ్‌ఎం టి.సత్యనారాయణ ఆవిష్కరించారు. శతకానికి చిత్ర కవిత అనే పేరుతో ముందుమాట రాసిన కవి నీలకంఠరావు పద్యాలపై వివరించారు. స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, కర్రి రాజు, పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు సత్యనారాయణ మూర్తి దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

మంత్రి దుర్గేష్‌కు కలెక్టర్ అభినందన



మంత్రి దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో జేసీ తేజ్‌భరత్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): కలెక్టర్ పి.ప్రశాంతి స్థానిక జేఎన్ రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మంత్రి దుర్గేష్‌ను జేసీ ఎస్.తేజ్ భరత్‌తో కలిసి ఆమె పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో పర్యాటక పరంగా పలు అంశాలపై చర్చించారు.

బ్యాంక్ ఉద్యోగుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: యాజమాన్యం ఉద్యోగుల వ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటోందంటూ నిరసిస్తూ తూర్పు గోదావరి జిల్లా బ్యాంక్ ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మంగళవారపుపేటలోని ఫెడరల్ బ్యాంక్ వద్ద ధర్నా నిర్వహించారు..సంఘ నాయకుడు లక్ష్మీపతిరావు మాట్లాడుతూ పాలసీకి వ్యతిరేకంగా, ఏకపక్ష నిర్ణయంతో బదిలీలు చేయడం దారుణమన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలు జరపాలని కోరారు. తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, 12వ వేతన సవరణ వెంటనే అమలుపర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, సోమరాజు, మురళి, కీర్తన, తరుణ్, వెంకటేశ్వరరావు, కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి వారాహి దేవి గుప్త నవరాత్రులు



వారాహిదేవి(ఫైల్)

సీటీఆర్ఐ: ఆషాఢ మాసంలో వారాహి దేవి గుప్త నవరాత్రులు పురస్కరించుకుని గాడాల మహాలక్ష్మి సమేత చిన్నవేంకటేశ్వర స్వామి పీఠంలో జూలై 4న నుంచి 18వ తేదీ వరకు అమ్మవారు వారాహి దేవిగా భక్తులకు దర్శనమిస్తారని పీఠాధిపతి డాక్టర్ చిన్నవేంకన్నబాబు స్వామీజీ అన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను స్థానిక తిలక్ రోడ్డులో శుక్రవారం ఆయనతో పాటు, ముదునూరి వేంకటలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి తెల్లవారుజామున అర్చనలు జరుగుతాయన్నారు. అలాగే ప్రతిరోజు సాయంత్రం శాంతి హోమాలు ఉంటాయని చెప్పారు. 18న ఉదయం 6 నుంచి 9 వరకు భక్తులకు అమ్మవారి ఎడమ చెవిలో వారి కోరికలు చెప్పుకొనే అవకాశం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్తలు మాతా దుర్గా వేంకట హేమావతి, సింగంశెట్టి మైహితోష్, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, పడాల వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తప్పవు

రాజమహేంద్రవరం సిటీ: అనుమతులు లేకుండా వైఎస్సార్ సీపీ కార్యాలయాలు నిర్మించడం సరైంది కాదని, ఇందుకు సహకరించిన రుడా, కార్పొరేషన్ అధికారులపై చర్యలు తప్పవని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహం వెనుక నిర్మిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని నాయకులతో కలసి పరిశీలించారు.

సినిమాలు



శ్యామల, సూర్య ప్యాలెస్, శివజ్యోతి, అనుశ్రీ, రాజా, రంభ, అప్సర, కుమారి	: కల్కి
సూర్య మినీ :	ఎ క్వైట్ ప్లేస్
స్వామి:	మహారాజా
ఊర్వశి :	సింహ ధ్వని
మేనక :	బాక్
నామవరం	
వీఎస్ మహల్:	కల్కి
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	కల్కి
కడియం	
వెంకటసూర్య :	కల్కి

హాస్య కర్మయోగి ముళ్లపూడి

సీటీఆర్ఐ: హాస్యంతో తాత్వికతను ముడిపెట్టిన కర్మయోగి ముళ్లపూడి అని నాట్యాచార్యుడు సప్పా దుర్గాప్రసాద్ అన్నారు. కళా గౌతమి, నటరాజ నృత్య నికేతన్ సంయుక్తంగా ముళ్లపూడి వెంకట రమణ జయంతిని స్థానిక నటరాజ నృత్య నికేతన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళా గౌతమి వ్యవస్థాపకుడు డా. బీవీఎస్ మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ హాస్యంతో పాటు వ్యంగ్య రచనకు ముళ్లపూడి పెద్ద పీట వేశారన్నారు. మధ్య తరగతి మానవ ప్రవృత్తులను అత్యంత సహజంగా చిత్రీకరించడంలో ఆయన సిద్ధ హస్తులన్నారు. పాత్రికేయుడిగా, కథా నవలా రచయితగా, అనువాదకునిగా, సినీ రచయితగా ముళ్లపూడి ఎన్నో ప్రయోగాలు చేసి, అన్నింటా విజయం సాధించారని కొనియాడారు. బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ బాల్యం నుంచే ముళ్లపూడికి నాటకాలన్నా, హాస్యమన్నా మక్కువన్నారు. ఆంధ్ర పత్రికలో పనిచేయడం ఆయనకు టర్నింగ్ పాయింట్ అయిందని చెప్పారు. నిర్మాతలు మధుసూదనరావు, బాపుతో కలిసి సినీ ప్రపంచంలో తన మార్కు హాస్యాన్ని పండించారన్నారు. హాస్యం క్లబ్ కన్వీనర్ డాక్టర్ హనుమంతరావు, ఎస్‌కేవీటీ తెలుగు శాఖ డాక్టర్ పీవీబీ సంజీవరావు, కాకినాడ కవి ఓబులేసు, కళాగౌతమి కార్యదర్శి డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి ప్రసంగించారు. ఇంకా ప్రముఖులు ఎంవీ అప్పారావు, సీఆర్‌ఎం శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



ముళ్లపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ఈఎన్‌టీ వ్యాధులపై అవగాహన ఉండాలి

కడియం: ప్రతిఒక్కరూ ఈఎన్‌టీ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని డా.రవికాంత్ అన్నారు. మండలంలోని దామిరెడ్డిపల్లిలో కొండేటి సుజానమ్మ, విజయరత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీశాంతి ఈఎన్‌టీ హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో ఈ శిబిరం జరిగింది. వైద్యులు సత్తి రవికాంత్ ఆధ్వర్యంలో 150 మందికి చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలను ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. రవికాంత్ మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు మానవ శరీరానికి ఒక కిటికీ వంటివని, వీటి ఆరోగ్యం శరీరారోగ్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. వీటిలో ఏ అవయవానికైనా అసౌకర్యంగా ఉంటే రోజువారీ కార్యకలాపాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. కేవలం నిపుణులైన వైద్యులు మాత్రమే ఆరోగ్య సమస్యలను గుర్తించగలరన్నారు. వైద్యులు ద్వారంపూడి శ్రీకాంత్‌రెడ్డి,, పిన్నమనేని ప్రియ, అరిగెల చంద్రశేఖరరావు వైద్య సేవలు అందించారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మా చిన్ని స్టార్స్ సందడి



తుమ్మలావ స్కూల్లో సందడి చేస్తున్న చిన్ని, కావ్య

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం తుమ్మలావ ఎంపీఎల్ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం 'మా చిన్ని స్టార్స్' విద్యార్థులతో కలిసి సందడి చేశారు. జూలై ఒకటి నుంచి స్టార్‌మాలో ప్రసారం కానున్న కొత్త టీవీషో 'చిన్ని'లోని పాత్రలైన చిన్ని, కావేరితో కలిసి విద్యార్థులు ఆడిపాడారు. ఆకర్షణీయమైన గేమ్‌లతో చిన్ని యువ ప్రేక్షకులను ఆకర్షించింది. అలాగే తల్లీబిడ్డ అనే అంశంపై పెయింటింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఆక్స్‌ఫర్డ్ బుక్‌లను అందించారు. అనంతరం విద్యార్థులకు చిన్ని, కావేరీ స్కూలు బ్యాగ్‌లను పంపిణీ చేశారు. సీరియల్ కథాంశాన్ని, విశేషాలను వివరించారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్

కడియం: సీజనల్ వ్యాధుల కాలం అయినందున గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని మండల పరిషత్ అధ్యక్షుడు వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ అధ్యక్షత వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులను ఎప్పటికప్పుడు గుర్తించడంతో పాటు, వాటి నివారణా చర్యలు తక్షణం చేపట్టాలన్నారు. ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజలకు ఎటువంటి అనారోగ్య లక్షణాలు కన్పించినా వెంటనే కడియం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలన్నారు. జూలై, ఆగస్టు నెలలను డయేరియా నివారణా మాసోత్సవాలుగా నిర్ణయించారని, అందుకనుగుణంగా వైద్య సిబ్బంది పనిచేయాలని ఎంపీడీఓ రాజ్‌మనోజ్ అన్నారు. వచ్చే రెండు నెలల్లో నిర్వహించవలసిన కార్యక్రమాలకు అనుగుణంగా అవసరమైన మందులు, రాపిడ్ టీంలను ఏర్పాటు చేశామని వైద్యాధికారులు ఎం.మణిజ్యోత్స్న, జి.స్వరూప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రామకృష్ణ, మహిళా హెల్త్ సూపర్‌వైజర్లు జి.కృష్ణకుమారి, పి.ఉమాదేవి, వైద్యారోగ్య, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

248 మందికి వైద్య సేవలు

సీతానగరం: మండలంలోని రామచంద్రపురంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో 248 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలందించారు. శుక్రవారం పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో డాక్టర్ రాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఇళ్ల వద్ద మంచంపై ఉన్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి, వైద్య సేవలు అందించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య పరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రత్నం, ఏఎన్‌ఎం పద్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాలానికి అనుగుణంగా బోధనా పద్ధతులు

డీఎస్ఈఓ వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, మారుతున్న కాలానికి, సాంకేతికతకు అనుగుణంగా బోధనా పద్ధతులు అవలంబించాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక సత్యసాయి గురుకులం ఆడిటోరియంలో శుక్రవారం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై చర్చించారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతికి నూతన పాఠ్య పుస్తకాలు మారినందున సిలబస్, పరీక్షా విధానం, పాఠ్య ప్రణాళిక రాసే విధానం తదితర అంశాలపై పునశ్చరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు అందరూ పూర్తి అవగాహనతో ఈ శిక్షణ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ, ఏఎంఓ గౌరీశంకర్, సీఎంఓ కె.శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, విషయ నిపుణులు ఆర్ శివనాగేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్ఈఓ వాసుదేవరావు

షెడ్డు తొలగింపు సరికాదు

కడియం: మండల కేంద్రమైన కడియంలోని కెనాల్ రోడ్డుపై నిర్మిస్తున్న రైతు బజార్ వద్ద ఉన్న తాత్కాలిక రేకుల షెడ్డును తొలగించడం సరికాదని వైఎస్సార్ సీపీ నాయకులు గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. రైతు బజారు నిర్మాణ సామగ్రిని నిల్వ చేసుకునేందుకు, కూలీలు విశ్రాంతి తీసుకునేందుకు ఈ షెడ్డును నిర్మించినట్టు వివరించారు. ఈ షెడ్డును ఆక్రమణగా భావించి, తొలగించాలని పంచాయతీ వారు ఆ షెడ్డుకు నోటీసు అతికించారన్నారు. రైతు బజార్ నిర్మాణం పూర్తయ్యాక ఆ షెడ్డును గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. అంతేకానీ దానిని తొలగించడం సరికాదన్నారు. తొలగింపు చర్యలను తక్షణం నిలుపుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్, తహసీల్దార్ బి.రమాదేవికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి శేషగిరి, శాఖ పట్టాభి, ఆర్ఎస్ఎస్ మూర్తి, బట్టు చిన్ని, దొడ్డ బుజ్జి, కుసునూరి బాబులు, సర్కార్ భాష, అవిరెడ్డి అబ్బు, కవల వెంకన్న, కడియం గణేష్, బత్తిన శ్రీధర్, కేసనపల్లి సురేంద్ర, కె.గంగాధర్, బొమ్మిరెడ్డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరజాల వీర్రాజు తదితరులు

ముగిసిన నాక్ బృందం పర్యటన

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గ్రేడ్ కేటాయించడానికి వచ్చిన నాక్ బృందం రెండు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రామన్ రంగరాజన్, కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ వైహెచ్ నాయక్ వడి, మెంబర్ డాక్టర్ అంజన్‌కుమార్ నాయుడు ఆఫీస్ పనితీరు, ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు, కళాశాల భౌతికమైన వాతావరణాన్ని పరిశీలించారు. అనంతరం ఎగ్జిట్ మీటింగ్ నిర్వహించి, కళాశాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు, అధ్యాపకులకు నాక్ బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, షేక్ మదీనా, సుబ్బారావు, డాక్టర్ మాధవ్, డాక్టర్ ఎం సుధామయి, వాణి, మీనాక్షి, అలేఖ్య, వెంకటేష్, సురేంద్ర, లైబ్రేరియన్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గట్టు ఢమాల్.. గుండె గుభేల్..

- ఏటిగట్టుకు రక్షణ కరవు
- ప్రమాదకరంగా మారిన బొరియలు
- జారిపోయిన మట్టి దిబ్బలు
- పటిష్టతకు కానరాని అధికారుల చర్యలు

సీతానగరం: అఖండ గోదావరి వరద నుంచి కాపాడే ఏటిగట్టుకు పెను ముప్పు పొంచి ఉంది. ఏటిగట్టు జారిపోయినా.. ప్రమాదకర బొరియలు ఏర్పడుతున్నా.. అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వచ్చేది వర్షాకాలం, ఆపై వరద ఉధృతి ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది.

దాదాపు పుష్కర కాలం క్రితం గోదావరి వరదతో ఏటిగట్టు జారి బలహీనంగా మారింది. సీతానగరం నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టుపై అనేక బొరియలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి వరదల సమయాల్లో ఏ ముప్పు ముంచుకొస్తుందోనన్న భయాందోళనలో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు. మునికూడలి వద్ద ఏటిగట్టు జారిపోవడంతో 2012లో ఇరిగేషన్, అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్ అధికారులు ధవళేశ్వరం నుంచి కూలీలతో ఇసుక బస్తాలను ఏటిగట్టు వెంబడి వేసి చేతులు దులుపుకొన్నారు. అదే సమయంలో సీతానగరంలోని లంకూరు వద్ద ఏటిగట్టు జారిపోవడంతో, అక్కడ కూడా ఇసుక బస్తాలు వేశారు. పన్నెండేళ్ల క్రితం వేసిన ఇసుక బస్తాలు మినహా ఏటిగట్టు పటిష్టతకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.

30కి పైగా బొరియలు

సీతానగరం నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టు మధ్య 30కి పైగా బొరియలు ఏర్పడ్డాయి. పదకొండేళ్ల క్రితం జాలిమూడి వద్ద ఏటిగట్టుపై పడిన పెద్ద బొరియలో సుమారు 20 ఇసుక బస్తాలు వేసి వదిలేశారు. నాలుగేళ్ల క్రితం గోదావరి వరద సమయంలో బొబ్బిల్లంక శివారున ఏటిగట్టు జారిపోతే, ఇరిగేషన్ అధికారులు ఇసుక బస్తాలు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.


భయాందోళనల్లో గ్రామాలు

గోదావరి వరదల సమయాల్లో ఏ ముప్పు ముంచుకొస్తుందోనని ఏటిగట్టు వెంబడి ఉన్న పురుషోత్తపట్నం, వంగలపూడి, రామచంద్రపురం, సింగవరం, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో గోదావరి వైపున ఉన్న మట్టిని కొందరు వ్యాపారులు తవ్వి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏటిగట్టు జారిన ప్రాంతాల్లో గట్టును పటిష్టపర్చి, బొరియలను తక్షణమే పూడ్చడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సీతానగరం ఏటిగట్టుపై ఏర్పడిన బొరియ

గట్టును పటిష్టపర్చాలి



సీతానగరం నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టుపై పన్నెండేళ్ల క్రితం బొరియలు ఏర్పడ్డాయి. వాటిని అధికారులు ఇంత వరకు పూడ్చిన పాపాన పోలేదు. గోదావరి వరద ఉధృతంగా వస్తే ప్రమాదమే. సంబంధిత అధికారులు తక్షణమే బొరియలను పూడ్చి, ఏటిగట్టును పటిష్టపర్చాలి.

– తిర్నాతి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, వంగలపూడి

ఇలా ఉంటే ప్రమాదమే..



గోదావరి వరద ఉధృతంగా వస్తే ఏటిగట్టుకు ప్రమాదమే. సీతానగరం, మునికూడలి వద్ద ఏటిగట్టు జారిపోయి ఉంది. పన్నెండేళ్ల క్రితం ఇసుక బస్తాలు వేసి వదిలేశారు. నాలుగేళ్ల క్రితం బొబ్బిల్లంక శివారున ఇసుక బస్తాలు వేశారు. ఇప్పటి వరకు ఏటిగట్టును పటిష్టపర్చడానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

– అయిల శేషగిరి, కాంగ్రెస్ నాయకుడు, కూనవరం

చర్యలు తీసుకుంటాం



గోదావరి వరదను దృష్టిలో ఉంచుకుని ఏటిగట్టుపై పడిన బొరియల్లో వేయడానికి ఇసుక బస్తాలు సిద్ధంగా ఉన్నాయి. బొరియల వలన ఎటువంటి ప్రమాదం లేదు. వీటిలో గ్రావెల్ వేయడానికి ఉన్నతాధికారులకు నివేదికను పంపించాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– శివ ప్రసాద్, ఏఈ, అఖండ గోదావరి లెఫ్ట్‌బ్యాంక్